# స్లీపర్‌సెల్స్‌తో జాగ్రత్త!

- అందాల పోటీలపై అప్రమత్తంగా ఉండండి
- అంతర్జాతీయ స్థాయి సంచలనాలకు తెగబడే చాన్స్
- అవుట్‌డోర్ ఈవెంట్స్‌పై దాడులకు అవకాశం
- వ్యూహాత్మక రక్షణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర నిఘా సంస్థల హెచ్చరిక



శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి భారీ భద్రత నడుమ వస్తున్న సుందరాంగి

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): ఆపరేషన్ సిందూర్, భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఉగ్రవాద సంస్థలకు అనుబంధంగా ఉన్న స్లీపర్‌సెల్స్ నిద్ర లేచాయని, ఉగ్రదాడులకు పాల్పడే అవకాశం ఉన్నదని కేంద్ర హోంశాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించినట్టు తెలిసింది. ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే విధంగా ఉగ్రదాడులు ఉండవచ్చని, ముఖ్యంగా తెలంగాణలో జరుగుతున్న ప్రపంచ అందాల పోటీల నిర్వహణ మీద స్లీపర్‌సెల్స్ దృష్టి సారించే ప్రమాదం ఉన్నదని కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అవుట్‌డోర్ ప్రాంతాల్లో నిర్వహించే అందాల పోటీల ఈవెంట్స్‌ను డేగ కండ్లతో నిశితంగా గమనించాలని ఆదేశించినట్టు సమాచారం. స్థానిక పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే స్థానిక సైన్యం సహకారం తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో అందాల పోటీలకు మూడు వారాలపాటు పూర్తిస్థాయి భద్రత కల్పించడం తెలంగాణ పోలీసులకు పెద్ద సవాల్ కానున్నది.

## నేటి నుంచి ప్రపంచ అందాల పోటీలు

పాల్గొననున్న 110దేశాల అందాల భామలు • అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: రాష్ట్ర సర్కారు

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): నేటి నుంచి హైదరాబాద్‌లో ప్రపంచ అందాల పోటీలు ప్రారంభం కానున్నాయి. సుమారు 110దేశాలకు పైగా సుందరాంగులు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకున్నట్టు అధికారులు తెలిపారు. పోటీలకు సర్వం సిద్ధం చేసినట్టు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఇప్పటికే రిహార్సల్స్ పూర్తయ్యాయని, పోటీలకు పూర్తి భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

### హైదరాబాద్‌లో స్లీపర్‌సెల్స్

హైదరాబాద్‌లో పదుల సంఖ్యలో స్లీపర్ సెల్స్ ఉన్నారని, వీరి కదలికల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరించినట్టు తెలిసింది. స్లీపర్‌సెల్స్‌ను పునరుద్ధరించడానికి పాకిస్థాన్ నిఘా సంస్థతో అనుబంధం ఉన్న ఉగ్రవాద సంస్థలు ప్రణాళికలు సిద్ధంచేసినట్టు నిఘా సంస్థలు గుర్తించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సంచలనం కోసం ఉగ్రదాడులు ఉండవచ్చని నిఘా సంస్థలు అనుమానిస్తున్నట్టు తెలిసింది. మిస్ వరల్డ్ పోటీలను స్లీపర్‌సెల్స్ టార్గెట్ చేసే ప్రమాదం ఉన్నదని, ఆయా దేశాల నుంచి వచ్చిన సుందరాంగులు, విదేశీ మీడియా ప్రతినిధుల భద్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్ కదలికలపై గట్టి నిఘా పెట్టాలని సూచించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సూచన మేరకు నడుచుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది.

### అవుట్ డోర్‌కు వెళ్లినప్పుడు జాగ్రత్త

గురువారం వరకు అందాల పోటీల నిర్వహణపై ఆత్మవిశ్వాసంతో ఉన్న మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు తాజా పరిణామాల నేపథ్యంలో పోటీల కొనసాగింపుపై పునరాలోచనలోపడ్డట్టు తెలుస్తున్నది. పాకిస్థాన్‌లో ఉన్న అమెరికా పౌరులు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించడంతో మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సైతం పోటీలను కొనసాగిస్తే తలెత్తే సమస్యలపై అంతర్జాతీయంగా అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు తెలిసింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10న మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల అనంతరం సుందరాంగులంతా 12వ తేదీ నుంచి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, హైదరాబాద్‌లోని చార్మినార్, లాడ్‌బజార్, వరంగల్ వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయం, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మహబూబ్‌నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే విధంగా తెలంగాణ టూరిజం ప్రణాళికలు రూపొందించింది. ఈ అవుట్‌డోర్ ఈవెంట్‌లే భద్రతకు సవాల్‌గా మారే అవకాశం ఉన్నదని పోలీసులు ఆందోళన చెందుతున్నట్టు తెలిసింది. చార్మినార్, లాడ్‌బజార్, రామప్ప ఆలయం, పిల్లలమర్రి తదితర ప్రాంతాలను అతి సున్నిత ప్రాంతాలుగా గుర్తించినట్టు తెలుస్తున్నది. ఇప్పుడున్న పరిస్థితుల్లో అవుట్‌డోర్ ఈవెంట్స్ జరిగే ప్రాంతాల్లో అందాల భామల పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతకు సంప్రదాయ రక్షణ చర్యల కంటే.. సాంకేతికతను వినియోగించుకొని వ్యూహాత్మక రక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర నిఘా వర్గాలు సూచించినట్టు సమాచారం.

---



ఎంపీడీవో కార్యాలయం ముందు గుండెపోటుతో కుప్పకూలిన మల్లయ్య

# రేషన్‌కార్డులో పేరుకోసం వస్తే ప్రాణమే పాయె!

- గుండెపోటుతో వృద్ధుడి మృతి
- కోటపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఘటన
- నాలుగైదు రోజులుగా వచ్చి వెళ్తున్న మల్లయ్య

కోటపల్లి, మే 9 : రేషన్ కార్డులో తన పేరు తొలగించగా, తిరిగి నమోదు చేయించుకునేందుకు వచ్చిన ఓ వృద్ధుడు ఎంపీడీవో కార్యాలయం ఎదుటే గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కోటపల్లిలో శుక్రవారం చోటుచేసుకున్నది. సూపాక గ్రామానికి చెందిన నల్లగుంట మల్లయ్య (60) కుటుంబానికి రేషన్ కార్డు ఉన్నది. ఇటీవల ఆ కార్డులో నుంచి మల్లయ్య పేరు తొలగించారు. తన పేరును తిరిగి నమోదు చేయించుకునేందుకు నాలుగైదు రోజులుగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి వచ్చివెళ్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూడా సూపాక గ్రామం నుంచి ఆర్టీసీ బస్సులో కోటపల్లికి వచ్చాడు. ఎంపీడీవో కార్యాలయం ముందున్న బల్లపై కూర్చుండగా, గుండెపోటుతో అక్కడే మరణించాడు. స్థానికులు చూసి అతడి బంధువులకు సమాచారం అందించారు. మల్లయ్య మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

## కొబ్బరికాయలు, దండలు అనుమతించం

- ముంబైలోని సిద్ధి వినాయక ఆలయ ట్రస్ట్ వెల్లడి

ముంబై, మే 9: ముంబైలోని ప్రసిద్ధ సిద్ధివినాయక ఆలయంలో కొబ్బరికాయలు, దండలు, నైవేద్యాలను అనుమతించటం లేదని ఆలయ అధికారులు శుక్రవారం ప్రకటించారు. భద్రతా కారణాల రీత్యా మే 11 నుంచి ఈ నిబంధనలను అమల్లోకి తీసుకొస్తున్నట్టు చెప్పారు. దక్షిణ ముంబై ప్రభాదేవి ప్రాంతంలోని సిద్ధివినాయక ఆలయానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఉగ్రవాదుల హిట్ లిస్ట్‌లో ఉన్నందున ఆలయం పరిసరాల్లో గట్టి భద్రతా చర్యలు తీసుకున్నట్టు ఆలయ ట్రస్ట్ చైర్మన్ సదా సర్వార్కర్ చెప్పారు.

---

## బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం



హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): బీసీలకు విద్య, ఉపాధి, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, అందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 9వ షెడ్యూల్‌లో బిల్లులను చేర్చాలని కోరుతూ రాష్ట్ర క్యాబినెట్ తక్షణం తీర్మానించాలని, అన్నిపార్టీలతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి పంపి ప్రధాని మోదీని కలిసేలా చర్య తీసుకోవాలని, రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో మద్దతు కూడగట్టేందుకు చొరవ చూపాలని కోరారు.

## ఐడీసీ కార్పొరేషన్‌కు 2,962.47కోట్లు

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జలవనరులు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీడబ్ల్యూఆర్ఐడీసీఎల్) లిమిటెడ్‌కు ప్రభుత్వం రూ.2,962.47 కోట్ల నిధులు మంజూరు చేసింది. శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వికారాబాద్ జిల్లాలోని కోటిపల్లివాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు రూ.89.30 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

## కేసముద్రంలో తొలి రెసిడెన్షియల్ పాలిటెక్నిక్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మొట్టమొదటి రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కాలేజీ మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఏర్పాటు చేస్తున్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో ఈ కాలేజీ ప్రారంభంకానుంది. రాష్ట్రంలో ఇదే తొలి రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కాలేజీ. బాలురతోపాటు బాలికలకు అడ్మిషన్లు కల్పిస్తారు.

---

## ఆర్‌వైవీ లబ్ధిదారులను ఎంపికచేయాలి: భట్టి

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాసం(ఆర్‌వైవీ) లబ్ధిదారులను ఎంపిక చేసి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున మంజూరుపత్రాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో రాజీవ్ యువ వికాసంపై సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ నెల 30లోగా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

# కబ్జాకోరులకు కొమ్ముకాస్తున్న కాంగ్రెస్

- సాధారణ కార్యకర్తలకు న్యాయం జరగడం లేదు
- ఏఐసీసీ సభ్యుడు స్పెన్సర్ లాల్ మండిపాటు
- 18న గాంధీభవన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరిక



ఉస్మానియా యూనివర్సిటీ, మే 9 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కబ్జాకోరులకు కొమ్ముకాస్తున్నదని, కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయడం లేదని ఏఐసీసీ సభ్యుడు, నేషనల్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ స్పెన్సర్‌లాల్ మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భూ కబ్జాలకు పాల్పడుతూ సొంత పార్టీకి చెందిన మహిళా నాయకురాలిని ఇబ్బంది పెడుతున్న నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శివకుమార్‌రెడ్డి కాంగ్రెస్‌కు చెందిన ఒక మహిళ భూమిని కబ్జా చేశారని, కోర్టులో కేసు ఉన్నందున ఆమె పేరును వెల్లడించడం లేదని పేర్కొన్నారు. శివకుమార్‌రెడ్డిపై గతంలోనూ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. శివకుమార్‌రెడ్డి తన కోడలు, ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి షాడోగా ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు. తక్షణమే కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయనను బహిష్కరించకుంటే ఈ నెల 18వ తేదీన గాంధీభవన్ ముందు ధర్నా, 19వ తేదీన గాంధీభవన్ నుంచి సచివాలయం వరకు నిరసన ర్యాలీ తీస్తామని స్పెన్సర్‌లాల్ హెచ్చరించారు.

---

## ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది దేశంలోకి నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించనున్నాయని భారత వాతావరణశాఖ తెలిపింది. ఈ నెల 13న రుతుపవనాలు దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నదని ప్రకటించింది. సాధారణంగా జూన్ 1 నాటికి కేరళ మీదుగా ఉత్తరం వైపునకు వెళ్లి, జూలై 15 నాటికి దేశమంతా విస్తరిస్తాయని, అయితే, ఈ ఏడాది ఊహించిన దానికంటే ముందుగానే జూన్ 1 నాటికి కేరళ తీరానికి, జూలై 11నాటికి దేశమంతా విస్తరించే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఐఎండీ అంచనా మేరకు మే 25 నాటికి రుతుపవనాలు కేరళ తీరానికి చేరుకుంటాయని అంచనా వేసింది.

## 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ వినతి

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : మాడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని తెలంగాణ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(టీఎంఎస్‌టీఏ) కోరింది. 3వేల మంది రెగ్యులర్ టీచర్లకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని అసోసియేషన్ అధ్యక్షుడు భూతం యాకమల్లు, సహ అధ్యక్షుడు వరప్రసాద్, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జనవరి నుంచి వేతనాలు రాలేదని, మరణించిన 40 మంది కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

## సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కమిటీ

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : పీఎం కుసుమ్ పథకంలో మహిళా సంఘాలకు కేటాయించిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం కలెక్టర్ల నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసింది. నలుగురు అధికారులతో డిస్ట్రిక్ట్ లెవల్ ఎగ్రిగ్యూషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో జారీచేసింది. కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా, డిస్కంల సూపరింటెండెంట్ ఇంజినీర్, రెడ్‌కో జిల్లా మేనేజర్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసింది.

# జవాన్లకు కన్నీటి వీడ్కోలు

- మందుపాతర పేలి మృతిచెందిన శ్రీధర్, సందీప్
- వారి స్వగ్రామాల్లో అధికారికంగా అంత్యక్రియలు
- కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం



శ్రీధర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



వడ్ల శ్రీధర్, సందీప్ (ఫైల్)

కామారెడ్డి/ఘట్‌కేసర్, మే 9: ములుగు జిల్లా వాజేడులో ఆపరేషన్ కగార్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మందుపాతర పేలి మృతి చెందిన తెలంగాణ గ్రేహౌండ్స్ జవాన్లు వడ్ల శ్రీధర్ (30), సందీప్ అంత్యక్రియలను శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. శ్రీధర్ అంత్యక్రియలను ఆయన స్వగ్రామమైన కామారెడ్డి జిల్లా పాల్వంచలో నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. శ్రీధర్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల్లో ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర పాల్గొన్నారు.

### ఘట్‌కేసర్‌లో సందీప్ అంత్యక్రియలు

వీరమరణం చెందిన సందీప్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో శుక్రవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో నిర్వహించారు. అంతకుముందు ఘట్‌కేసర్‌లోని సందీప్ నివాసానికి చేరుకున్న స్పీకర్ గడ్డం ప్రసాదరావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ గౌతం, రాచకొండ సీపీ సుధీర్ బాబు, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు సందీప్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సందీప్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

### సీఎం సంతాపం.. రూ. కోటి ఎక్స్‌గ్రేషియా

మందుపాతర పేలి ముగ్గురు కానిస్టేబుళ్లు మృతిచెందగా, సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని వెల్లడించారు. రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. భద్రతా స్కీమ్‌లో రూ. 80 లక్షలు, 300 గజాల ఇంటి స్థలం కేటాయించారు. కుటుంబీకుల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు.

# 6 నెలలపాటు కాల్పుల విరమణ

- బీఆర్‌ఎస్ శాంతి చర్చల తీర్మానం హర్షణీయం
- మావోయిస్ట్ పార్టీ అధికార ప్రతినిధి జగన్ లేఖ

సుబేదారి, మే 9: తెలంగాణ ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మెజార్టీ రాజకీయ పార్టీలు మావోయిస్ట్ పార్టీకి, ప్రభుత్వానికి మధ్య శాంతి చర్చలు జరుపాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో తమ నుంచి ఆరు నెలల వరకు కాల్పుల విరమణ పాటిస్తున్నామని మావోయిస్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక లేఖ విడుదల చేశారు. లేఖలోని సారాంశం ఇలా.. 'కొంత కాలంగా మా పార్టీకి, ప్రభుత్వానికి మధ్య శాంతి చర్చలు జరుపాలని తొలుత తెలుగు రాష్ట్రాల్లో డిమాండ్ మొదలైంది. ఇందులో భాగంగా శాంతి చర్చల కమిటీ ఏర్పడింది. దేశవ్యాప్తంగా కొన్ని వందల సంఘాలు, వ్యక్తులు, ప్రముఖులు, రాజకీయ పార్టీల వారు ఇదే విషయమై డిమాండ్ చేస్తున్నారు. కగార్ ఆపరేషన్ రద్దు చేయాలని సీపీఐ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అం తర్గత సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. శాంతి చర్చ లు జరుపాలని బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ లో తీర్మానం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత, సీఎం రేవంత్‌రెడ్డి శాంతి చర్చలు జరుపాలని డిమాండ్ చేయడం హర్షణీయం' అని జగన్ ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వామపక్ష పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు శాంతి చర్చలకు డిమాండ్ చేస్తున్నాయని, చర్చల ప్రక్రియ రాష్ట్రంలో, దేశంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని తీసుకొచ్చే ప్రయత్నంగా అర్థం చేసుకోవాలి సూచించారు. దీనికి సానుకూలతను కల్పించేందుకు తమ నుంచి కాల్పు ల విరమణ ప్రకటిస్తున్నామని జగన్ తెలిపారు.

## *38 మంది మావోయిస్టుల లొంగుబాటు*

- భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు వెల్లడి

*కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 9 : వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 38 మంది మావోయిస్టులు లొంగిపోయినట్టు భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 81వ, 141వ బెటాలియన్ అధికారులు ఆదివాసీల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యకలాపాలు, ఆపరేషన్ 'చేయూత'కి ఆకర్షితులై మావోయిస్టులు లొంగిపోతున్నట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన 38 మందిలో.. ఇద్దరు పార్టీ సభ్యులు, 16 మంది మిలీషియా సభ్యులు, ఏడుగురు వీసీఎంలు, ఆరుగురు కేఎంఎస్ సభ్యులు, ముగ్గురు చైతన్య నాట్యమండలి సభ్యులు, నలుగురు గ్రామ రక్షక దళ సభ్యులు ఉన్నట్టు ఆయన వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సహాయార్థం నగదు ప్రోత్సాహకాన్ని అందించినట్టు పేర్కొన్నారు.*



## 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా పూజలు

*ఆపరేషన్ సిందూర్ పేరిట పోరాడుతున్న భారత త్రివిధ దళాలకు భగవంతుడి అనుగ్రహం కలగాలని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం మహాగణపతి హోమం, నవగ్రహ మన్యు శత్రుజయ పాశుపత హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.* - చేర్యాల

## ఉద్యానరంగం అభివృద్ధికి ప్రణాళిక అవసరం

- ఉద్యాన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజిరెడ్డి

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : ఉద్యానరంగం అభివృద్ధికి ఒక ప్రణాళిక అవసరమని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అభ్యుదయ రైతులు, ఎఫ్‌పీవోలు(ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజర్స్), వ్యవసాయ-వ్యాపార సంస్థలు, ఎగుమతి, సరఫరాదారులు, పరిశోధన నిపుణులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్ పోకడలు, పంటల వైవిధ్యం, ఎఫ్‌పీవోల సామర్థ్యం, వ్యవసాయ సాంకేతిక ఏకీకరణ, పంటల నిర్వహణ, ఎగుమతి అవకాశాలు, పరిశ్రమ ఆధారిత ఇన్‌పుట్, ప్రాసెసింగ్ పరిష్కారాలు తదితర అంశాలపై చర్చించారు. ఎఫ్‌పీవోలను మార్కెట్లతో అనుసంధానించడంలో డిజిటల్ ప్లాట్□ఫామ్‌ల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, ముల్కనూర్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, అప్పారావు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ చీనానాయక్, డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ సురేశ్‌కుమార్, యూనివర్సిటీ లైబ్రేరియన్ రాజశేఖర్, టెక్నికల్ ఆఫీసర్ వీణాజోషి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సతీశ్ పాల్గొన్నారు.

## ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఎస్‌ఈసీ రాణి కుముదిని, విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



బాధిత జర్నలిస్ట్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న మంత్రి పొంగులేటి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

## అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు

- నెలాఖరులోగా ప్రెస్ అకాడమీ భవనం ప్రారంభిస్తాం
- ఐఅండ్‌పీఆర్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కులు అందజేత

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్‌తోపాటు అనారోగ్యం పాలై, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేసి నెలాఖరులోగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. విడతలవారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమీ ఖర్చు పెడుతున్నదని వెల్లడించారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.లక్షతోపాటు ఐదేండ్ల వరకు నెలకు రూ.3,000 చొప్పున పెన్షన్, 1 నుంచి 10వ తరగతి వరకు చదివే వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద నెలకు రూ.1,000 చొప్పున అందిస్తున్నట్టు తెలిపారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు పెంచాలని కోరారు.

### సర్వేయర్లను నియమిస్తాం

రాష్ట్రంలోని రైతాంగానికి మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా సర్వే, సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో సర్వే, సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ శాఖపై సమీక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 420 మంది మాత్రమే లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నారని, కొత్తగా సుమారు ఐదువేల మందిని నియమిస్తామని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఇంటర్‌లో గణితం సబ్జెక్టు కలిగి 60% మార్కులతో ఉత్తీర్ణులైన ఐటీఐ డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) ఇతర సమానమైన అర్హతలు కలిగినవారు అర్హులని పేర్కొన్నారు. అర్హులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ ఫీజు ఓసీలు రూ.10 వేలు, బీసీలు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.